చట్టసభల్లో 27 శాతం బిసి రిజర్వేషన్ల కోసం
అన్ని పార్టీల నేతలనూ కలిశాం : దాసు సురేశ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చట్టసభల్లో 27 శాతం బిసి రిజర్వేషన్ల కోసం జరుగుతున్న పోరాటానికి మద్దతివ్వాలని కోరుతూ అన్ని పార్టీల నేతలనూ ఢిల్లీలో కలిసినట్టు బిసి రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాము కలిసిన వారిలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, ఆప్ రాజ్యసభ ఫ్లోర్ లీడర్ సంజయ్‌సింగ్, బిజెపి బిసి మోర్చా జాతీయ అధ్యక్షులు కె లక్ష్మణ్, ఎస్‌పి సీనియర్ నేత రామ్‌గోపాల్ యాదవ్, బిఎస్‌పి, జెడియు నేతలను కలిసినట్టు పేర్కొన్నారు. చట్టసభల్లో బిసిల రిజర్వేషన్ల కోసం కావాల్సిన చట్టసవరణ కోసం కేంద్ర ప్రభుత్వం సంకల్పిస్తే తాము మద్దతిస్తామని సీతారాం ఏచూరి హామీనిచ్చారని తెలిపారు. చట్టసవరణకు అవసరమైన కార్యాచరణకు చేపట్టాలని లక్ష్మణ్‌ను కోరగా పార్లమెంటరీ కమిటీలో చర్చిస్తామని హామీనిచ్చారని పేర్కొన్నారు. తెలంగాణలో త్వరలోనే బిసి రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ పెడతామని తెలిపారు. అన్ని పార్టీలను ఆ సభకు ఆహ్వానించనున్నట్టు పేర్కొన్నారు.

'సుకన్య' ఖాతాల ఓపెన్‌లో పోస్టల్‌శాఖ రికార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సుకన్య సమృద్ధి యోజన ఖాతాల ఓపెనింగ్‌లో తెలంగాణ సర్కిల్ పోస్టల్‌శాఖ రికార్డు సాధించింది. ఈ నెల 9 నుంచి 11 వరకు రాష్ట్రంలోని 6,208 పోస్టాఫీసుల్లో నిర్వహించిన సుకన్య మహామేళా కార్యక్రమంలో 34,384 ఖాతాలు ఓపెన్ చేసినట్టు హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎమ్ సంతోష్‌కుమార్ నరహరి తెలిపారు. ఈ మేళాలో 28,970 సుకన్య ఖాతాలు ఓపెన్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, కానీ అంతకంటే ఎక్కువగా 118.69 శాతం ఖాతాలను ప్రారంభించగలిగామన్నారు. 2015 జనవరి నుంచి 2023 జనవరి వరకు రాష్ట్రంలోని అన్ని పోస్టాఫీసుల్లో మొత్తంగా 8,62,776 సుకన్య ఖాతాలు ఓపెన్ చేశామన్నారు. ప్రజల నుంచి ఈ స్కీంకు విశేష ఆదరణ లభిస్తున్నదని తెలిపారు. 2015లో ఈ ఖాతాలు ఓపెన్ చేసిన అనేకమంది ఇప్పుడు పాక్షిక విత్‌డ్రాయల్స్ ద్వారా లబ్ధిపొందుతున్నారని వివరించారు. అత్యధికంగా ఖమ్మం డివిజన్‌లో 4,266 ఖాతాలు, సికింద్రాబాద్ డివిజన్‌లో 3,858, కరీంనగర్ డివిజన్‌లో 3,503, హైదరాబాద్ సౌత్ డివిజన్‌లో 2,629, నల్గొండ డివిజన్‌లో 2,239 ఖాతాలు ఓపెన్ చేసినట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ స్కీంలో 11 లక్షల ఖాతాలు ఉన్నాయని చెప్పారు. 0-10 సంవత్సరాలలోపు ఆడపిల్లల పేరుపై రూ.250తో ఈ ఖాతాను ప్రారంభించవచ్చు. గరిష్టంగా ఏడాదికి రూ.1.50 లక్షలు డిపాజిట్ చేయవచ్చు. పాక్షిక విత్‌డ్రాయల్ అవకాశం ఉంది.

గుడిసెల కోసం 'పోరాటాలు..'

- పాతికేళ్లు కావస్తున్నా.. పట్టాలకు నోచుకోని వైనం
- నెరవేరని 27 ఏళ్ల నిరీక్షణ
- పట్టాలు ఇవ్వాలని ఐదు నెలలుగా బాధితుల ఆందోళనలు

బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒక ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పేదల ఇంటి జాగాలు, భూములను మరో ప్రభుత్వం లాగేసుకోవడం పరిపాటిగా మారింది.. టిడిపి ప్రభుత్వ హయాంలో 1996-97లో ఇళ్ల స్థలాల కోసం ఇస్తే.. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం గుంజుకుంటోంది.. దీన్ని నిరసిస్తూ తమ స్థలాలను తమకే ఇవ్వాలంటూ బాధితులు సిపిఎం ఆధ్వర్యంలో ఐదు నెలలుగా పోరాడుతున్నారు.. అక్కడే గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. వాటికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు.

వనపర్తి జిల్లా అమరచింత మున్సిపాల్టీ పరిధిలో పేదల కోసం పాతిక సంవత్సరాల కిందట టిడిపి ప్రభుత్వం పేదలకు ఇంటి జాగాల పట్టాలిచ్చింది. పట్టణానికి దగ్గరలో దుబాయికుంటలో 7.30 ఎకరాలను 1996-97లో పేదల ఆవాసాల కోసం పంపిణీ చేశారు. కానీ వారికి హద్దులు చూపించలేదు. దాంతో అప్పటి నుంచి ఇళ్లు కట్టుకోలేకపోయారు. మొత్తం 400 మంది లబ్ధిదారులున్నారు. గతేడాది సెప్టెంబరు ఆరున బాధితులంతా.. తమ భూముల్లో గుడిసెలు వేసుకున్నారు. పట్టాలకు సంబంధించి హద్దులు చూపించాలని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అయినా ఫలితం లేకపోవడంతో సిపిఎం ఆధ్వర్యంలో అమరచింతలో బాధితులు పెద్దఎత్తున ర్యాలీగా వెళ్లి ఆ భూమిలో గుడిసెలు వేసుకున్నారు. దాంతో ఎంఆర్ఓతో పాటు సిఐ, 20 పోలీసులు వచ్చి హద్దులు చూపిస్తామని హామీ ఇచ్చారు. ఐదు నెలలు దాటినా హామీ అమలు కాలేదు. మక్తల్ ఎమ్మెల్యే, వనపర్తి కలెక్టర్, మంత్రి నిరంజన్‌రెడ్డికి విన్నవించుకున్నా ఫలితం లేదు. దాంతో బాధితులంతా రోజూ అక్కడే ఉంటూ నిరసన తెలుపుతున్నారు. ఒక్కో ఇంటికోసం ఇప్పటికే రూ. పది వేలు ఖర్చు పెట్టుకున్నారు. ఇక్కడ ఒక కాలనీ మాదిరిగా తయారైంది. సిపిఎం నాయకులే గుడిసెవాసులకు తాగునీరు, విద్యుత్ ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో పెద్దఎత్తున ఎంఆర్ఓ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం అఖిలపక్షం ఏర్పాటు చేశారు. రాజకీయ పార్టీలన్నీ పేదల పక్షమేనని నేతలు చెప్పారు. బాధితులకు స్థలాల హద్దులు చూపించాలని డిమాండ్ చేశారు. అయితే బిఆర్ఎస్ నాయకులు మాత్రం గుడిసెలు తీయాలని పట్టుబట్టగా.. ఎట్టి పరిస్థితుల్లోనూ గుడిసెలు తీసేది లేదని సిపిఎం నేతలు వాదించారు.

నిరుపేదల నిరీక్షణ

ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల ఆవాసాల కోసం ఆందోళనలు జరుగుతున్నాయి. వనపర్తి జిల్లా, నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్, ఎత్తం, బల్మూరు, అచ్చంపేట , కల్వకుర్తి ప్రాంతాల్లో ఇంటి స్థలాల కోసం ఉద్యమాలు చేస్తున్నారు. కొల్లాపూర్‌లో ఎనిమిదెకరాలు, బల్మూరులో నాలుగెకరాల్లో ప్లాట్లు చేయాలని బాధితులు కోరుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంతో పాటు పలు చోట్ల నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పంచాలని కోరుతున్నా... పాలకులు స్పందించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేదల సొంతింటి కల నెరవేర్చాలని ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

పట్టాలు ఇవ్వకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం
ఎండి జబ్బార్- సిపిఎం, వనపర్తి జిల్లా కార్యదర్శి

జిల్లాలో అనేక చోట్ల పేదలకు ఆవాసాల కోసం గతంలో ఇచ్చిన స్థలాలను ఇప్పటికీ చూపలేదు. ముఖ్యంగా అమరచింత పట్టణంలో 400 మంది ఇళ్ల కోసం 7.30 ఎకరాలను పాతికేళ్ల కిందట కేటాయించారు. ఇప్పటికీ స్థలాలకు హద్దులు చూయించలేదు. స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం రూ. ఐదు లక్షలు ఇవ్వాలి. లేనిచో కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం.

వనస్థలిపురంలో బస్ టెర్మినల్

- 'హరిణ వనస్థలి' నుంచి 1.354 హెక్టార్ల భూమి కేటాయింపు
- ఆమోదం తెలిపిన రాష్ట్ర వైల్డ్ లైఫ్ బోర్డు
- శ్రీశైలం రహదారి విస్తరణకు అనుమతి నిరాకరణ
- వన్యప్రాణుల దాడిలో చనిపోతే రూ.10 లక్షల పరిహారానికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వనస్థలిపురంలో నిర్మించబోయే బస్‌టెర్మినల్‌కు మహవీర్ హరిణ వనస్థలి జాతీయ పార్కు నుంచి 1.354 హెక్టార్ల భూమిని ఇచ్చేందుకు వైల్డ్ లైఫ్ బోర్డు ఆమోదం తెలిపిందని పిసిసిఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్ ఆర్ఎం.డోబ్రియాల్ తెలిపారు. శ్రీశైలం రహదారి విస్తరణకు అనుమతి ఇవ్వాలంటూ వచ్చిన దరఖాస్తును తిరస్కరించామన్నారు. వన్యప్రాణుల దాడిలో ఎవరైనా చనిపోతే బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ఇచ్చే ప్రతిపాదనలను రాష్ట్ర సర్కారుకు పంపనున్నట్టు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర వన్యప్రాణి మండలి, మనుషులు-జంతువుల మధ్య ఘర్షణ వాతావరణం తగ్గించే చర్యల సూచన కమిటీ సమావేశాలను నిర్వహించారు. స్టేట్ వైల్డ్ లైఫ్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించిన తర్వాత జరిగిన తొలిసమావేశం ఇదే. సమావేశాల నిర్ణయాలను డోబ్రియాల్ మీడియాకు వివరించారు. రాష్ట్రంలో మొదటి సారి చేపట్టిన పులుల ఆవాసాల్లో ఉన్న మానవ ఆవాసాల తరలింపు (కవ్వాల్‌లో రెండు గ్రామాలు) ప్రక్రియ సజావుగా కొనసాగుతున్నదని చెప్పారు. వన్యప్రాణుల దాడుల్లో చనిపోయిన వారికి ఇచ్చే నష్టపరిహారాన్ని పెంచాలని నిర్ణయించామని తెలిపారు. ప్రస్తుతమిస్తున్న రూ.5 లక్షల పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచుతూ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామన్నారు. సాధారణ గాయాలైతే వాస్తవ వైద్యం ఖర్చు (లక్ష రూపాయలకు మించకుండా), తీవ్రంగా గాయపడితే వైద్యానికి అయ్యే ఖర్చు (మూడు లక్షల రూపాయలకు మించకుండా), అంగవైకల్యం ఏర్పడితే లక్ష రూపాయల పరిహారం, పెంపుడు జంతువులు చనిపోతే వాస్తవ అంచనా(యాభై వేల రూపాయలకు మించకుండా) ఇచ్చే ప్రతిపాదనలను కూడా సిద్ధం చేశామన్నారు. అలాగే పంట నష్ట పరిహారాన్ని రూ.7,500కు పెంచాలని కూడా సిఫారసు చేయనున్నట్టు తెలిపారు. గత బోర్డు సమావేశంలో 24 ప్రతిపాదనలు అటవీ అనుమతుల కోసం రాగా 15 అప్లికేషన్లను పరిశీలించి అనుమతుల కోసం నేషనల్ వైల్డ్ లైఫ్ బోర్డుకు పంపామన్నారు. మిగతా తొమ్మిది రాష్ట్ర పరిధిలో ఉన్నాయన్నారు. తాజాగా మరో ఏడు ప్రతిపాదనలపై ఈ సమావేశంలో చర్చించామన్నారు. వనస్థలిపురంలోని బస్‌టెర్మినల్‌కు స్థలం కేటాయించిన నేపథ్యంలో హరిణ వనస్థలి కోసం అవసరమైన రక్షణాత్మక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శ్రీశైలం రహదారి విస్తరణ కోసం వచ్చిన ప్రతిపాదనను అమ్రాబాద్‌లోని వన్యప్రాణి సంరక్షణను దృష్టిలో పెట్టుకుని తిరస్కరించామన్నారు. కడెం పరిధిలో లక్ష్మీపూర్ లిఫ్ట్, నాగార్జున సాగర్ పరిధిలో పెద్ద గుట్ట లిఫ్ట్ కేబుల్ పనులకు అనుమతులిచ్చామన్నారు. వన్యప్రాణులు ప్రమాదంలో పడ్డప్పుడు కాపాడేందుకు అవసరమైన రెస్క్యూ టీమ్‌ల సంఖ్యను పెంచాలని నిర్ణయించామన్నారు.

కూకట్‌పల్లిలో అగ్ని ప్రమాదం

మూడు ప్రయివేటు బస్సులు దగ్ధం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో మరో అగ్ని ప్రమాదం జరిగింది. ఆదివారం అర్ధరాత్రి కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పార్కింగ్ చేసిన మూడు ప్రయివేట్ బస్సుల్లో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయాయి. కూకట్‌పల్లి సిఐ నర్సింగ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. భారతి ట్రావెల్స్‌కు చెందిన ఏడు బస్సులు కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు సమీపంలోని షెడ్‌లో పార్కింగ్ చేసి ఉన్నాయి. అర్ధరాత్రి మూడు బస్సులో మంటలు చెలరేగాయి. దాంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పారు. మిగతా నాలుగు బస్సులను మరో ప్రాంతానికి తరలించారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందనే దాని మీద విచారణ చేపట్టి వివరాలు వెల్లడిస్తామని సిఐ తెలిపారు.

కాజీపేట-బలార్షా రూట్లో పలురైళ్లు రద్దు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లోని కాజీపేట-బలార్షా సెక్షన్‌లో ఈ నెల 15 నుంచి 24, 25 తేదీల వరకు పలు రైళ్లను పూర్తిగా, మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సిహెచ్ రాకేష్ తెలిపారు. ఈ రూట్లో మూడవ లైన్ కనెక్టివిటీ నాన్ ఇంటర్ లాకింగ్ పనులు కొనసాగుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. ప్రయాణీకులు రైల్వే ఎంక్వైయిరీ ద్వారా ఆయా రైళ్ల వివరాలను తెలుసుకోవచ్చని చెప్పారు. పై రూట్లో 17 రైళ్లు పూర్తిగా, ఏడు రైళ్లు పాక్షికంగా రద్దు అయినట్టు తెలిపారు.

బహుజన రాజ్యాధికార యాత్రలో పాల్గొన్న ప్రవీణ్ కుమార్

పోడు రైతులను దురాక్రమణదారులనడం సిగ్గుచేటు

- బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పోడు భూములు సాగు చేస్తున్న రైతులను సిఎం కెసిఆర్ దురాక్రమణదారులు అనడం సిగ్గుచేటని బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా సోమవారం ఆయన ఉట్నూర్‌కు వచ్చారు. ఐటిడిఎ నుంచి తహసీల్దార్ కార్యాలయం, పాత బస్టాండ్ మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు సాగింది. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలు మంజూరు చేయడంలో కెసిఆర్ ప్రభుత్వం విఫలమైందన్నారు. అందుకు నిదర్శనమే ఉట్నూర్ తహసీల్దార్ కార్యాలయమని చెప్పారు. ఎన్నో దశాబ్దాల కాలంలో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఏజెన్సీ ప్రాంతాలను సిఎం పట్టించుకోవడంలేదని విమర్శించారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే నోరూ మెదపడం లేదన్నారు. ఈ ప్రాంతంలో ప్రజలు, గిరిజనులు పడుతున్న బాధలను చూశానన్నారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల చుట్టుపక్కల ఉన్న వేల కోట్ల విలువైన భూములను స్వాధీనం చేసుకునేందుకు ధరణి తీసుకొచ్చారని ఆరోపించారు. రాష్ట్రాన్ని మరోసారి దోచుకోవడానికే ధరణి అన్నారు. ధరణి వల్ల సాగుదారులు ఇబ్బందులు పడుతున్నా, సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను చూస్తుంటే ఏదో మ్యాచ్ ఫిక్సింగ్ లాగా ఉందన్నారు. కేవలం అంకెల గారేడిని ప్రవేశపెట్టారన్నారు. ఏజెన్సీలో పోడుభూములు సాగు చేసుకుంటున్న వారందరికీ పట్టాలు ఇవ్వకుండా సాగుదారులను దురాక్రమణదారులుగా పోల్చడం సరైంది కాదన్నారు. వెంటనే కెసిఆర్ ఆదివాసీ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి పోడు భూములను సాగు చేసుకుంటున్న వారిపై దాడులు, దౌర్జన్యం చేసి జైల్లో పెట్టిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలు అభివృద్ధి సాధించాలంటే బిఎస్‌పి అధికారంలో రావాలని, దీనికి ప్రజలు సహకరించాలని కోరారు.

15,16 తేదీల్లో ఎల్బి స్టేడియంలో వాలీబాల్ పోటీలు

- కెసిఆర్ పుట్టినరోజు సందర్భంగా నిర్వహణ
- పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు పుట్టినరోజును పురస్కరించుకుని భారత జాగృతి ఆధ్వర్యంలో ఈ నెల 15,16 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కేసీఆర్ కప్-2023 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం ఆవిష్కరించారు. మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.75 వేలు, తృతీయ బహుమతి రూ.50 వేలతోపాటు క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులనూ ఇవ్వనున్నట్టు ఆమె ప్రకటించారు. కెసిఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని దళిత, క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 15న నిర్వహించనున్న దళిత క్రైస్తవ ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌నూ ఆమె విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపి వద్దిరాజు రవిచంద్ర, భారత జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, ఉపాధ్యక్షుడు మేడే రాజీవ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన వర్సిటీని వెంటనే ప్రారంభించాలి

- ప్రధాని మోడీకి పోస్టుకార్డుల ఉద్యమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పది శాతం గిరిజన రిజర్వేషన్లు అమలు చేయాలని, గిరిజన విశ్వవిద్యాలయాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి పోస్టు కార్డులను పంపే ఉద్యమాన్ని బీఆర్ఎస్ గిరిజన విద్యార్థి విభాగం చేపట్టింది. సోమవారం హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద ఆ సంఘం నాయకులు దాడి శ్రీనునాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి కెటిఆర్ చేనేత కార్మికుల సమస్యలపై ప్రారంభించిన పోస్టు కార్డు ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని దీన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో గిరిజన విశ్వవిద్యాలయాన్ని వెంటనే ప్రారంభించాలని కోరారు. అదే అంశంపై సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా వెయ్యి మంది గిరిజన విద్యార్థులతో ప్రధాని మోడీకి వెయ్యి పోస్టు కార్డులను పంపిస్తామని పేర్కొన్నారు.

బండ ప్రకాశ్‌కు కోలేటి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాశ్‌కు తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం మండలిలో బండ ప్రకాశ్‌ను కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. ఆయన నిబద్ధత గల నాయకుడని పేర్కొన్నారు. మండలిలో జరిగే చర్చలు రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు.

శివరాత్రికి 2427 ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రంలోని వివిధ శైవ క్షేత్రాలకు యాత్రీకుల సౌకర్యార్థం 2,427 ప్రత్యేక బస్సుల్ని నడుపుతున్నట్టు టిఎస్‌ఆర్‌టిసి చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, మేనేజింగ్ డైరెక్టర్ విసి సజ్జనార్ తెలిపారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 40 శైవక్షేత్రాలకు ఈ నెల 17 నుండి 19వ తేదీ వరకు ప్రత్యేక సర్వీసులను నడుపనున్నట్టు తెలిపారు. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలానికి 578, వేములవాడకు 481, కీసరగుట్టకు 239, ఏడుపాయలకు 497, వేలాలకు 108, కాళేశ్వరానికి 51, కొమురవెల్లికి 52, కొండగట్టుకు 37, ఆలంపూర్‌కు 16, రామప్పకు 15, ఉమా మహేశ్వరానికి 14 ప్రత్యేక బస్సులను నడుతున్నామన్నారు. శ్రీశైలం యాత్రా స్థలానికి హైదరాబాద్‌లోని ఎంజిబిఎస్, జెబిఎస్, దిల్‌సుఖ్‌నగర్, ఐఎస్ సదన్, కెపిహెచ్‌బి, బిహెచ్ఇఎల్ నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయనీ, వీటిలో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. అలాగే గ్రూపులుగా శైవక్షేత్రాలకు వెళ్లేవారి కోసం అద్దె బస్సులపై పది శాతం రాయితీని టిఎస్‌ఆర్‌టిసి కల్పిస్తోందని, ఈ సౌకర్యం వినియోగించుకోవాలని

పారిశుద్ధ్య కార్మికులకు అరకొర జీతాలు

- పాదయాత్ర ముగియక ముందే చర్చలకు పిలువండి : పాలడుగు భాస్కర్
- సమస్యలు వివరించిన కార్మికులు

చెత్తను తీసుకెళ్లే రిక్షాను తొక్కుతున్న పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో గ్రామపంచాయతీ కార్మికులకు రూ.4000 వేతనం ఇవ్వడం సిగ్గుచేటని, అరకొర జీతాలతో కుటుంబాలను ఎలా నెట్టుకొస్తారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒక వైపు పల్లె ప్రకృతి వనాల శుభ్రత.. మరోవైపు మోరీల సఫాయి, కుళ్లిన కుక్కల కళేబరాలు తరలింపు లాంటి పనులన్నీ పంచాయతీ కార్మికుల వల్ల సాధ్యమేనా అని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జరుగుతున్న పాదయాత్ర రెండవ రోజు సోమవారం దేవరుప్పుల మండలంలో కొనసాగింది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు అధ్యక్షతన ముందుగా ధర్మపురం గ్రామంలో సాయుధ పోరాట యోధులు దుర్గ్యానాయక్‌ను కలిసి పోరాట స్ఫూర్తి విషయాలను తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని షేక్ బందగీ స్థూపానికి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. కరోనా సమయంలో మనిషికి మనిషికి సంబంధం లేకుండా జీవించిన తరుణంలోనూ గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రజలకు చేసిన సేవలు, శ్రమ, మానవత్వంను కొనియాడారు. కరోనా సమయంలో చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం, ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రతేడాది దుస్తులతో పాటు మాస్కులు, గ్లౌజులు, తోపుడు బండ్లు అందించాలన్నారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దుచేసి కారోబార్, బిల్ కలెక్టర్ ప్రత్యేక హోదా కల్పించాలని కోరారు. మేజర్ గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా, చిన్న గ్రామ పంచాయతీ కార్మికులకు ఏడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో వారి కుటుంబాలు గడవడం కష్టంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నిధులు విడుదల చేసి, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఆరోగ్య బీమా కల్పించాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, దళిత బంధు పథకంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని లేకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాగా, పాదయాత్ర సాయంత్రం వరకు మండలంలోని సింగరాజుపల్లి వరకు చేరుకుంది. పాదయాత్రలో భాగంగా ఒక చోట పాలడుగు భాస్కర్ చెత్తను తీసుకెళ్లే రిక్షాను తొక్కారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు తమ సమస్యలను పాదయాత్ర బృందానికి వివరించారు. పాదయాత్రలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు గ్యార పాండు, చాగంటి వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గణపతి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు తునికి మహేష్, వినోద్ కుమార్ జనగామ జిల్లా అధ్యక్షులు బత్తిని వెంకన్న, మండల అధ్యక్షకార్యదర్శులు రామచందర్, గనగాని ఉప్పలయ్య, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

అదాని కుంభకోణాలపై..
జెపిసి వేయడానికి మోడీకి భయమెందుకు?

ఆర్‌బిఐ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సిపిఐ నేతలు

- ఆర్‌బిఐ వద్ద ధర్నాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అదాని కుంభకోణాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయడానికి ప్రధాని నరేంద్రమోడీకి భయమెందుకని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. జెపిసిలో అధికార బిజెపికి సంబంధించిన పార్లమెంట్ సభ్యులూ ఉంటారని, నరేంద్రమోడీ ఎలాంటి తప్పులూ చేయకుంటే ఆ కమిటీని వేయడానికి ఎందుకు వెనుకాడుతున్నారని ప్రశ్నించారు. అదానీ కుంభకోణాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీని వేయాలని, తక్షణమే అదానీని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ దేశ వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని ఆర్‌బిఐ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. అదానీ ఆర్థిక సామ్రాజ్యం గాలిబుడగ లాంటిదని, అది అవినీతి పునాదులపై నిర్మించిన సామ్రాజ్యమని విమర్శించారు. హిండెన్ బర్గ్ విడుదల చేసిన నివేదిక తర్వాత అదానీ అవినీతి సంపాదన గుట్టురట్టు అయిందన్నారు. నరేంద్రమోడీ కనుసన్నల్లోనే ఎల్ఐసి నుంచి రూ.80 వేల కోట్లు, ఎస్‌బిఐ నుంచి రూ.25 వేల కోట్ల పెట్టుబడులు అదాని కంపెనీలలో పెట్టారని చెప్పారు. అదానీ కంపెనీల కుంభకోణాలను వెలికితీయాలని ప్రతిపక్షాలు, వామపక్ష పార్టీలు డిమాండ్ చేస్తుంటే, ప్రధాని ఎదురుదాడికి పూనుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సొమ్మును అదానీ కంపెనీలో ఎలా పెట్టుబడులు పెడతారని, ఇప్పుడు నష్టపోయిన సొమ్ముకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. దేశ వార్షిక బడ్జెట్ రూ.45 లక్షల కోట్లు ఉంటే, అందులో దాదాపు జిఎస్‌టి రూపంలో రూ.20 వేల కోట్లు వసూలు అవుతున్నాయని, ఆ జిఎస్‌టిలో పేదవాడు కట్టిన సొమ్మే ఎక్కువ భాగమని చెప్పారు. పేదలకు ఇచ్చే సబ్సిడీలను క్రమేపి తగ్గిస్తున్నారని, ఆహారం మీద రూ.లక్ష కోట్లు తగ్గించారని, ఎరువులపై రూ.50 వేల కోట్లు. ఇలా మొత్తం సబ్సిడీలను రూ.మూడు లక్షల కోట్లకు తగ్గించారని వివరించారు. ఈ విధంగా తగ్గించుకుంటూ పేదవాడిని కొట్టి కార్పొరేట్ సంస్థలకు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సిపిఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. నరేంద్రమోడీ గుజరాత్ ముఖ్యమంత్రి కానప్పుడు అదానీ ఎవరో సమాజానికి తెలియదని, అలాంటి వ్యక్తి మోడీ అండదండలతో ప్రపంచ కుబేరులలో స్థానం పొందారని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో రూ.30 వేల కోట్లు కోత విధించారని, ప్రజలకు ఇచ్చే సొమ్ముపై కోతలు విధించి, కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఎన్ బాలమల్లేష్, విఎస్ బోస్, ఇటి నర్సింహ్మాలు, కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, ఎ రవీంద్రాచారి, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ అంజయనాయక్, బికెఎంయు రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మా, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, సిపిఐ రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కార్యదర్శులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS: GUNTUR
DISPUTE No. 86 of 2022

Between:-
M/s Margadarsi Chit Fund Pvt. Ltd., Station Road, Tenali ... Disputant
and
Ms. P.Purnima and Others ....Opponents

OPPONENT-1
Ms.Ponnekanti Purnima W/o G Krishna Kishore, Commission Agent, M/s Star Powerz Digital Technologies P Ltd., Paigah Plaza, Basheerbagh, Hyderabad.
OPPONENT-2
Mr. Gunda Krishna Murthy S/o Manaiah Prop: M/s Bhavani Water Suppliers, Muthangi Vil., Patancheru Mdl., Sangareddy Dist
OPPONENT-4
Mr. Mohammed Abdul Aleem S/o Md. Abdul Aziz Sr. Assistant,Staff No.2517833 Oio Govt. Institute of Eletronics, East Maredpally, Secunderabad.

Whereas the above named Disputant filed the above Dispute against you for recovery of a sum of Rs.3,63,952.00 for notice of you that you are hereby required to appear before the Deputy Registrar of Chits, Guntur,on 21-02-2023 11.00 a.m. either personally of through an advocate and for your defence / objections. If you fail to attend the office of the Deputy Registrar of Chits on that day the matter will be heard and decided exparty basis on the material available.
(By order of the Deputy Registrar of Chits)
BMSD PRASAD
ADVOCATE, TENALI

మహారాజశ్రీ గన్నవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నెం. 391/2016 ఇన్ ఓ.ఎస్.15/2014

కోగంటి శివరామవరప్రసాద్, తండ్రి లేటు నాగభూషణం, హిందు, వయసు 67 సం॥లు డోర్ నెం. 42-2/1-132, DRWA 266, 1st Lane, 4th Right cross Road, దేవినగర్, విజయవాడ
- పిటిషనర్/ వాది

అండ్

ఆర్1. కోగంటి వీరబ్రహ్మం, తండ్రి లేటు నాగభూషణం, హిందు, 72 సం॥లు R/o. My Home Jewel Block-D Gold మధీనాగూడ, హైదరాబాద్.
ఆర్4. కోగంటి కృష్ణా ప్రసాద్, తండ్రి లేటు నాగభూషణం, హిందు వయసు 57 సం॥లు C/o. కోగంటి వీరబ్రహ్మం,R/o. My Home Jewel Block-D Gold మధీనాగూడ, హైదరాబాద్
ఆర్7. రావూరి భాగ్యలక్ష్మి భర్త సురేష్, హిందూ వయసు 46 సం॥లు R/o Plot No. 1511, గాయత్రి టవర్స్, మధీనాగూడ,హైదరాబాద్
ఆర్8. కేతినేని అనూష తండ్రి లేటు సుబ్రమణ్యం హిందు వయసు 29 సం॥లుR/o Plot No. 1511, గాయత్రి టవర్స్, మధీనాగూడ, హైదరాబాద్
- రెస్పాండెంట్లు

వాయిదా తేది: 13-03-2023

పై నెంబరు ఐ.ఎ. 391/2016 లో మీకు కోర్టు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను నోటీసులు పంపగా సదరు నోటీసులు తీసుకొనకుండా కాలయాపన చేసినందున సదరు నోటీసులు అమలుకుగాను కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము తెలియపరచడమైనది. కావున పై తేదిన మీరు ఉదయం 10.30.ని॥లకు మీరు స్వయముగా గాని, ప్లీడరు గారు ద్వారా గాని హాజరై ఆక్షేపణలున్నచో తెలియపరచుకోవలెను. లేనిచో పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచడమైనది.
వాయిదా తేది: 13-3-2023.

ఇట్లు
జాస్తి తాతారావు,
పిటిషనరు తరపు న్యాయవాది,
గన్నవరం

ముగిసిన ఐఎస్‌విఐఆర్ వార్షిక సదస్సు

హైదరాబాద్ : నాలుగు రోజుల పాటు సాగిన ఇండియన్ సొసైటీ ఆఫ్ వాస్కులర్ అండ్ ఇంటర్వెన్షనల్ రేడియాలజీ 23వ వార్షిక సదస్సు ముగిసిందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు పాల్గొన్నారన్నారు. సొసైటీ కేవలం 28 మంది వ్యవస్థాపక సభ్యులతో తన కార్యకలాపాలను ప్రారంభమై ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1300 మంది ఇంటర్వెన్షనల్ రేడియాలజీ నిపుణులు సభ్యులును కలిగి ఉందన్నారు. ఈ సంవత్సరం సిల్వర్ జూబ్లీనీ జరుపుకుంటుందన్నారు. ఈ సదస్సులో ఐఎస్‌విఐఆర్ అధ్యక్షుడు డాక్టర్ సుయాష్ కులకర్ణి, ఉపాధ్యక్షుడు డాక్టర్ బాలాజీ పటేల్ కోలా, కార్యదర్శి డాక్టర్ అజిత్ కె యాదవ్, కోశాధికారి డాక్టర్ భవేష్ ఎ పోపాట్ తదితరులు పాల్గొన్నారని తెలిపింది.

ఈమోజ్ వర్చువల్ వేదికను పరిచయం చేసిన ఐఐఎల్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) మొదటిసారి తమ మెడికల్ ప్రతినిధుల కోసం ఈమోజ్ అనే వర్చువల్ వేదికను సోమవారం ఆవిష్కరించింది. ఇది వైద్యులు, మెడికల్ ప్రతినిధుల సమాచారాన్ని సులభతరం చేయనున్నది. దీనిద్వారా వైద్యులకు ఎక్కువ సౌకర్యాన్ని అందించడం, వారి విలువైన సమయాన్ని ఆదా చేయడం ద్వారా రోగికి మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని ఐఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.ఆనంద్‌కుమార్ తెలిపారు. "ఈ తరం ఆరోగ్య సంరక్షణ నిపుణులు డిజిటల్ కమ్యూనికేషన్ విధానంపై చాలా ఆసక్తి చూపుతున్నారు. మా దగ్గరకు వచ్చే రోగులకు ఆకర్షణీయమైన డిజిటల్ అనుభవాన్ని ఈ మోజ్ ద్వారా అందించాలని మేం భావిస్తున్నాం' అని తెలిపారు.

పంచాయతీ కార్మికుల పాదయాత్రకు ఎస్‌డబ్ల్యుఎఫ్ మద్దతు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు పాలడుగు భాస్కర్‌తో పాటు మరో ఐదుగురు నాయకులు చేస్తున్న పాదయాత్రకు టిఎస్‌ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా పాలకుర్తిలో జరిగిన సభలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్ రాంచందర్ పాల్గొని మద్దతు తెలిపారు. వారి పాదయాత్రకు సంఘీభావంగా రూ.5వేల నగదును సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, గ్రామ పంచాయతీ కార్మిక నాయకులు సీహెచ్ వెంకటయ్యకు అందజేశారు. ప్రజారోగ్యాన్ని కాపాడటంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న కృషి గొప్పదనీ, అలాంటి వారి సమస్యలు పరిష్కరించకపోవడం అన్యామన్నారు. వారికి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికులు కూడా ఇలాంటి సమస్యలతోనే సతమతమవుతున్నారని చెప్పారు. ప్రభుత్వం తక్షణం స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తి

- సిఇఒ వికాస్ రాజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తి అయిందని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సిఇఒ) వికాస్‌రాజ్ తెలిపారు. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్‌లో ఓటర్ల నమోదు పూర్తయినట్లు చెప్పారు. డిసెంబర్ 31, 2022 నాటికి ఈ మూడు జిల్లాల్లో ఓటర్ల సంఖ్య 29,501గా ఉందన్నారు. కొత్తగా 1,331 ఓటు హక్కు దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 23న జాబితా ప్రకటించి పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీ) పంపిస్తామని వెల్లడించారు. గతంలో తిరస్కరించిన 1,440 దరఖాస్తుల్లో 788 సరైనవేనని వికాస్‌రాజ్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌తో 9 జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటా, వ్యయ పరిమితి నిబంధన లేదని సిఇవో తెలిపారు.

తెలుగు రాష్ట్రాల్లో త్వరలో ఖాళీ కానున్న ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఏపీ, తెలంగాణలోని ఉపాధ్యాయ, పట్టభద్రులు, స్థానిక సంస్థల్లో ఖాళీ అవనున్న స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఏపీలో 3 పట్టభద్రులు, 2 ఉపాధ్యాయ, 8 స్థానిక సంస్థల స్థానాలు (మొత్తం 13), తెలంగాణలో ఒక్కో ఉపాధ్యాయ, స్థానిక సంస్థల స్థానాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్సీల పదవీకాలం మార్చి 29తో ముగియనున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది. తెలంగాణలోని హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ స్థానంతో పాటు హైదరాబాద్ స్థానిక సంస్థల స్థానంలో ఈసీ ఎన్నికలు నిర్వహించనుంది.

అప్పుడే 'వేసవి' తాకిడి

- ఎండుతున్న పంట పొలాలు
- సాగర్ ఎడమకాల్వ చివరి భూములకు అందని నీరు
- ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
వేసవి ప్రభావం అప్పుడే పంట పొలాలపై పడింది.. బోరు బావుల్లో నీరున్నా.. కాల్వల ద్వారా నీరు వస్తున్నా కరెంట్ కోతలు.. రాత్రి వేళల్లో కరెంట్ ట్రిప్ అవ్వడంతో మరమ్మతులు లేక పొలాలకు నీరు పారడం లేదు. సాగర్ ఎడమకాల్వ పరిధిలోని మేజర్ల కింద ఉన్న పంట పొలాలకు సాగునీరు అందడం లేదు. చివరి వరకు నీరు రాకపోవడంతో వరి పొలాలు ఎండుతున్నాయి. పొట్ట దశలోకి వచ్చిన వరి పంట పొలాలకు నీరు అందకపోవడంతో ఆ పొలాలు బీడుగా మారుతున్నాయి. ప్రధానంగా రాత్రి వేళలో కరెంటు సరఫరా చేయడం.. అర్ధరాత్రి సమయంలో కరెంట్ ట్రిప్ కావడంతో చివరి భూములకు నీరు అందడం లేదని రైతులు పేర్కొంటున్నారు. మెట్ట పంటలు వేయాల్సిన భూముల్లో కూడా వరి సాగు చేయడం వల్ల పంట విస్తీర్ణం పెరిగి నీటి వినియోగం సరిపోవడం లేదని అధికారులు అంటున్నారు. కాలువ లైనింగ్ పనులు పూర్తిగా ఆధునీకరించామని.. మరమ్మతులు చేశామని.. చివరి భూములకు కూడా నీరు అందుతుందని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా.. అది వాస్తవ రూపం దాల్చడం లేదు.

సాగర్ ఎడమకాల పరిధిలో ముల్కల కాల్వ, కిష్టాపురం, వజిరాబాద్, ముక్తల్ బ్రాంచ్ కాల్వలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 80 వేల ఎకరాల వరి పంట సాగు అవుతుంది. సుమారు 20శాతం అంటే 16 వేల ఎకరాలు కాల్వ చివరి భూములుగా ఉన్నాయి. ఈ భూములకు సాగు నీరు అందటం లేదు. ఒక్కొక్క బ్రాంచ్‌కు 170 క్యూసెక్కుల నీటిని విడుదల

చేయాలని డిజైన్ చేసినప్పటికీ.. దానికి 200 నుంచి 220 క్యూసెక్కుల వరకు విడుదల చేస్తున్నారు. అయినా చివర భూముల వరకు నీరు పారడం లేదు. వరి పొలాలకు నీరు అందక పొట్ట దశలోనే ఎండిపోయి బీడులుగా మారుతున్నాయి.

సరఫరా కానీ 24 గంటల కరెంట్

వ్యవసాయానికి నిరంతరం విద్యుత్తు అందిస్తున్నామని అధికారులు చెబుతున్నా వాస్తవానికి నిరంతర కరెంటు అందడం లేదు. వ్యవసాయానికి రాత్రి వేళలో కరెంట్ ఇవ్వడం వల్ల అర్ధరాత్రి సమయాల్లో ట్రిప్ అవుతుంది. రాత్రి 10 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు కరెంటు అందిస్తున్నారు. ఆ సమయంలోనే మోటార్ల ద్వారా సాగునీటిని పంట పొలాలకు మళ్లించుకుంటున్నారు. రాత్రి వేళలో కరెంట్ ట్రిప్ కావడం వల్ల మరమ్మతులు చేసే వారు లేకపోవడంతో ఆ భూములకు నీరు అందడం లేదు. గ్రామాల్లో ఉన్న మెకానిక్‌ల ద్వారా మోటార్లు రిపేరు చేయించుకోవడంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీని కారణంగా ఒకటి రెండ్రోజుల పాటు నీరు అందే పరిస్థితి లేకుండా పోయింది. ఇదే తరహాలో కాలువ చివర భూముల రైతుల పరిస్థితి ఉంది.

పగటిపూట కరెంట్ ఇవ్వాలి
భాస్కర్,రాయిని పాలెం

రాత్రిపూట కరెంట్ ఇవ్వడం వల్ల మధ్యలో ట్రిప్ అవుతుంది. పొలాలకు ఒకేసారి కరెంట్ ఇవ్వడంతో లోడ్ పెరిగి మోటార్లు కాలిపోతున్నాయి. ఈ మోటర్లు రిపేరు చేయించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ఆ లోపు పొలాలకు నిరందక ఎండిపోతున్నాయి. రాత్రి వేళలో కాకుండా పగటి వేళలో కరెంటు ఇవ్వాలి.

చివరి భూముల రైతులను ఆదుకోవాలి
రాగిరెడ్డి మంగారెడ్డి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి

మేజర్ల పరిధిలో ఉన్న కాలువ చివరి భూములకు నీరు అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. డిజైన్ ప్రకారం నీటిని విడుదల చేస్తున్నా చివరి భూముల వరకు నీరు అందడం లేదు. ప్రధానంగా రాత్రి వేళలో కరెంటు ఇవ్వడం వల్ల రైతులందరూ ఆ సమయంలోనే నీటిని తమ పొలాలకు మళ్లించుకుంటున్నారు. కాల్వ చివరి వరకు నీరు పారడం లేదు. చివరి భూముల వరకు నీరందించి రైతులను ఆదుకోవాలి. లేని పక్షంలో రైతులను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన చేస్తాం.

నీటిని పొదుపుగా వాడుకోవాలి
ఎన్నెస్పీ డిఇ, బుచ్చిబాబు

సాగునీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలి. ముఖ్యంగా మేజర్ల పరిధిలోనే ఉన్న చివరి భూముల రైతులకు సాగునీరు అదేవిధంగా పైన ఉన్న రైతులు సహకరించాలి. నీరు కింది వరకు పారే విధంగా రైతులు చూడాలి. వరి పంట సాగు విస్తీర్ణం పెరగడం వల్ల చివరి భూములకు నీరందడం కష్టంగా మారింది. అయినప్పటికీ డిజైన్ కంటే అదనంగా సాగునీటిని విడుదల చేస్తున్నాం.

జర్నలిజం విద్యార్థులు భాషపై పట్టుపెంచుకోవాలి

- పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ విసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
జర్నలిజం కోర్సు చదివే విద్యార్థులు, జర్నలిస్టులు భాషపై పట్టుపెంచుకోవాలని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కిషన్ రావు అన్నారు. సమాజంపై అవగాహనతో ముందుకు పోవాలని సూచించారు. సోమవారం నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీలో జర్నలిజం విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం జరిగింది. వర్సిటీ రిజిస్ట్రార్ భట్టు రమేష్, మాజీ రిజిస్ట్రార్ సత్తిరెడ్డి, ప్రొఫెసర్లు సుధీర్ కుమార్, హసీనా అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రావు మాట్లాడుతూ.. జూనియర్ విద్యార్థులు సీనియర్ల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. వర్సిటీ అభివృద్ధికి విద్యార్థులునిర్మాణాత్మక సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. జర్నలిజం వృత్తి పవిత్రమైనదనీ, దాన్ని గొప్పతనాన్ని కాపాడాలని సూచించారు. ఈ సందర్భంగా అతిథులతో పాటు ఎంసిజె

సెకండియర్ చదువుతున్న సెంట్రల్ సెన్సార్ బోర్డు మెంబర్ వేణుగోపాల్, బిసి కమిషన్ మెంబర్ కిషోర్ గౌడ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాహుల్ రావు, నవీన్, జక్కుల వెంకటేశ్, లవకుమార్, ప్రియాంక, జ్యోతి, రమణి, అనిల్ కుమార్, ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

రేపు సిఎం కొండగట్టు పర్యటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ముఖ్యమంత్రి కెసిఆర్ బుధవారం కొండగట్టులో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు కెసిఆర్ బేగంపేట నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో కొండగట్టుకు చేరుకుంటారు. ఉదయం 9:40 గంటలకు సిఎం కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకుంటారు. కోనేరు పుష్కరిణి, కొండలరాయుని గుట్ట, సీతమ్మ వారి కన్నీటిధార, భేతాళ స్వామి ఆలయంతో పాటు తదితర ప్రాంతాలను సిఎం పరిశీలించనున్నారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు అధికారులతో కెసిఆర్ సమావేశమవుతారు. అనంతరం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు. వాస్తవానికి సిఎం కెసిఆర్ మంగళవారమే కొండగట్టుకు వెళ్లాల్సి ఉన్నా.. మంగళవారం కొండగట్టుకు హనుమాన్ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున, భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దనే ఉద్దేశంతో బుధవారానికి వాయిదా వేసుకున్నారు.

కార్పొరేట్ కాలేజీ హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య

- న్యాయం చేయాలంటూ విద్యార్థి సంఘాల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ఇంటర్‌లో పరీక్షల్లో మాస్ కాపియింగ్ చేశావంటూ కళాశాల యాజమాన్యం మందలించడంతో అవమానంగా భావించిన విద్యార్థిని హాస్టల్ గదిలో ఉరేసుకుంది. ఈ ఘటన హైదరాబాద్ మేడిపల్లి పిఎస్ పరిధిలో సోమవారం జరిగింది. మేడిపల్లి పోలీసులు, విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం..

నాగర్ కర్నూల్ జిల్లా, బల్మూరు మండలం చెంచుగూడా గ్రామానికి చెందిన నిమ్మల రాములు పెద్ద కుమార్తె రమాదేవి(17) మేడ్చల్ జిల్లా పీర్జాదీగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ చైతన్య ఇంటర్ కళాశాలలో మొదటి ఏడాది చదువుతోంది. సోమవారం ప్రీఫైనల్ పరీక్షల్లో చూసి రాస్తుందని లెక్చరర్ మందలించారు. దాంతో తీవ్ర మనస్తాపానికి గురైన రమాదేవి హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తోటి విద్యార్థులు తలుపు తీసేందుకు ప్రయత్నించగా ఎంతకూ తీయకపోవడంతో కిటికిలోంచి చూడగా రమాదేవి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. దాంతో వారు యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు. వారు మేడిపల్లి పోలీసులకు అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందకు దించి గాంధీ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

కళాశాల వేధింపులు భరించలేకనే రమాదేవి ఆత్మహత్య చేసుకుందని, కళాశాల గుర్తింపు రద్దు చేయడంతోపాటు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్, బిఆర్‌ఎస్‌వి, బిఎస్‌పి, కాంగ్రెస్ నేతలు కళాశాల ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సంతోష్ రాథోడ్ మాట్లాడుతూ.. మార్కులు, ర్యాంకులే లక్ష్యంగా విద్యార్థులపై కఠినంగా వ్యవహరించి, విద్యార్థిని ఆత్మహత్యకు కారకులైన కళాశాల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యకు కారణమైన యాజమాన్యంపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలన్నారు. విద్యార్థిని కుటుంబానికి రూ.50 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నేతలను పోలీసులు అరెస్టు చేసి ఉప్పల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

వెంకట్ రాములు, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, మేడ్చల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎండి అన్వర్, కాంగ్రెస్ పార్టీ పీర్జాదీగూడ నగర అధ్యక్షుడు తుంగతుర్తి రవి, బిఆర్‌ఎస్‌వి నేత వర్కాల శివకిషోర్ గౌడ్, రాకేష్, బిఎస్‌పి నాయకులు అంబేద్కర్, ఎంఆర్‌పిఎస్ మేడ్చల్ జిల్లా కన్వీనర్ పంగ ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

32 ఫామ్‌హౌస్‌లపై ఏక కాలంలో పోలీసుల దాడులు

- మొయినాబాద్, మేడ్చల్, శంషాబాద్‌లోని ఫామ్‌హౌస్‌ల్లో అసాంఘిక కార్యకలాపాలు
- 22 మంది అరెస్టు, పలు సామగ్రి స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రంగారెడ్డి జిల్లా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏకకాలంలో 32 ఫామ్‌హౌస్‌లపై పోలీసులు దాడులు చేశారు. ఇందులో నాలుగు ఫామ్‌హౌస్‌లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు చేస్తున్నట్టు గుర్తించారు. ఈ దాడుల్లో 22 మందిని అరెస్టు చేసి, పలు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ పిఎస్ పరిధిలోని బిగ్‌బాస్ ఫామ్‌హౌస్, జహంగీర్ డ్రీమ్ వ్యాలీ ఫామ్ హౌస్, శంషాబాద్ పిఎస్ పరిధిలోని రిఫ్లెజ్ ఫామ్‌హౌస్, మేడ్చల్ పిఎస్ పరిధిలోని గోవర్ధన్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంపై సోమవారం దాడులు నిర్వహించారు. శంషాబాద్‌లో అక్రమంగా మద్యం, హుక్కా సేవిస్తున్నట్టు గుర్తించారు.

మేడ్చల్‌లో బెట్టింగ్ ఆడుతున్న ఏడుగురిని పట్టుకున్నారు. బిగ్‌బాస్ ఫామ్‌హౌస్ వాచ్‌మెన్ అబ్దుల్ మజీద్, ఉప్పల్‌కు చెందిన బి స్వామిని అరెస్టు చేశారు. ఫామ్‌హౌస్ యజమాని పరారీలో ఉన్నాడు. జహంగీర్ డ్రీమ్ వ్యాలీ ఫామ్ హౌస్‌లో మంగళ్ హాట్‌కు చెందిన షేక్ సొఫియాన్ ప్రయివేటు వర్క్ చేస్తున్న టోలిచౌకికి చెందిన ఇస్మాయిల్, ఎండి నవాజ్, ఎండి అఫ్రోజ్ అలీ, కాలా పత్తర్‌కు చెందిన సయ్యద్ సిద్ధిక్, బాలానగర్‌కు చెందిన సయ్యద్ రఫీ, బోయిన్‌పల్లికి చెందిన ఎండి ఎజాజ్ అక్తర్ హుస్సేన్, బోరబండకు చెందిన ఎండి నదీమ్, ఎండీ ఫ్రోజ్ ఖాన్, మల్లేపల్లికి చెందిన ఎండి ముస్తఫా అరెస్టు

చేశారు. ఇంటి యజమాని అజహర్ పరారీలో ఉన్నాడు. శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో రిఫ్లెజ్ ఫార్మ్ హౌస్‌లో కాచిగూడకు చెందిన నిఖిల్, హైటెక్ సిటీకి చెందిన ఫామ్ హౌస్ యజమాని హేమంత్, సూపర్‌వైజర్ మహ్మద్ ఇంతియాజ్, ఘాన్సీమియా గూడకు చెందిన మేనేజర్ రాజు పట్టుబడ్డారు. మేడ్చల్ గోవర్ధన్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో ఫామ్‌హౌస్ యజమాని గోవర్ధన్ రెడ్డి, మీనాక్షి ఎంక్లేవ్ కండ్లకోయకు చెందిన పి రాజేష్, కొంపల్లి బృందావన్ ఎంక్లేవ్‌కు చెందిన ఎం మాధవ రెడ్డి, యంజాల్‌కు చెందిన టి శ్రీనివాస్, కండ్లకోయకు చెందిన ఎస్ రవి, కౌకూర్‌కు చెందిన ఆర్ ప్రకాష్ రావు, షాపూర్‌నగర్‌కు చెందిన సాయి పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ. 1.03 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ప్లే కార్డులు పది సెట్లు, సెల్ ఫోన్లు ఏడు, హుక్కా కుండలు పది, హుక్కా పైపులు ఐదు, హుక్కా బ్లూ బెర్రీ రుచులు 17, బొగ్గు నాలుగు, సిల్వర్ పేపర్ మూడు, ఫిల్టర్ ప్యాకెట్ - 1 ఎంఎ 19 బ్లెండర్ ప్రైడ్ - 1, కింగ్ ఫిషర్ లైట్ - 16, బ్రీజ్‌లు ఐదు, ఇతర మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఆర్గానిక్ వివాహం చేసిన రైతుకు అభినందనలు

- చెరుకూరి రామారావుకు మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ఆర్గానిక్ వివాహం చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచిన రైతు చెరుకూరి రామారావుకు వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు రామారావుకు మంత్రి బహిరంగ లేఖ రాశారు. "మెకానికల్ ఇంజనీరింగ్ చేసిన మీ కుమారుడు కిరణ్ స్వయంగా ఆర్గానిక్ ఉత్పత్తులను విక్రయించడం అభినందనీయం. పెళ్లంటే అంగరంగ వైభవంగా ఉండాలనే ఆలోచనలోఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో మీ ఆలోచనను గౌరవిస్తూ నూతన దంపతులు ఈ తరహా వివాహానికి ఒప్పుకోవడం యువతలో సమాజంలో ఉన్న సమస్యలపై ఉన్న అవగాహన, బాధ్యతకు నిదర్శనం.

మీ కుమారుడు, కోడలి వివాహం వార్త మీడియా ద్వారా తెలుసుకున్నాను. నూతన దంపతులు కిరణ్, ఉదయశ్రీలకు నా తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు..... "అని తెలిపారు. దశాబ్దాల వాడకం తర్వాత గానీ పురుగు మందులు, ఎరువులతో వ్యవసాయోత్పత్తులు, ప్రజలపై చూపిస్తున్న ప్రభావం ప్రపంచానికి తెలిసి రాలేదని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. రసాయనాల ప్రభావంతో ప్రజలకు విపరీతమైన ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని ఆయన తెలిపారు. ప్రజలు ఆరోగ్యం విషయంలో ఏం కోల్పోయారనే విషయాన్ని కరోనా గుర్తు చేయడంతో ఇటీవల సహజ, సాంప్రదాయ సాగు ద్వారా పండిస్తున్న ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులకు ఆదరణ పెరిగిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా ప్రజల్లో చైతన్యం చేస్తున్నదని తెలిపారు.

ఉద్యోగి ప్రవర్తన వల్ల ఐఎఎస్ అయ్యాను

- ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ

ప్రజాశక్తి కల్చరల్
వరంగల్‌లో ఉద్యోగిగా ఉన్నప్పుడు కలెక్టర్ కార్యాలయంలో రేషన్ కార్డ్ కోసం వెళితే అక్కడ ఉద్యోగి నిర్లక్ష్య ప్రవర్తన చూసి.. తానే రేషన్ కార్డ్ ఇచ్చే స్థాయికి రావాలని శ్రద్ధాగా చదివి ఐఎఎస్ సాధించానని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణాచారి చెప్పారు. ఏ పాఠశాలలో చదివాము, ఏ భాషాలో చదివామో ముఖ్యం కాదనేది నేటి యువత గ్రహించి, పట్టుదల దీక్ష ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆయన అన్నారు. శ్రీత్యాగరాయ గాన సభలో ప్రధాన వేదికపై జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్ నిర్వహణలో డాక్టర్ రమణాచారి జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన పేరిట ప్రతిభా పురస్కారాలు సాహితీ కిరణం పత్రిక సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, కళా పోషకుడు రాఘవ రెడ్డికి, నాట్య గురువు సజనికి ప్రదానోత్సవం సభ జరిగింది. డాక్టర్ రమణ మాట్లాడుతూ పురస్కారా గ్రహీతలు వారి రంగంలో ప్రముఖులని అభినందించారు. ముఖ్యమంత్రులు వద్ద పని చేసి మెప్పు పొందటం సులువు కాదని వివరించారు చిల్ల రాజశేఖర రెడ్డి అధ్యక్షత వహించిన సభలో రామ కృష్ణ, దామరాజు శ్రీనివాసరావు, టివి న్యూస్ రీడర్ విజయ చంద్రిక తదితరులు పాల్గొన్నారు. వెంకటరెడ్డి స్వాగతం పలికిన సభకు కవి వెంకట దాసు వ్యాఖ్యానించారు.

తెలుగు పద్యం అపురూపం

- అధికార భాషా సంఘం చైర్మన్ మంత్రి శ్రీదేవి

ప్రజాశక్తి కల్చరల్
మరే భాషాలోనూ లేని పద్య ప్రక్రియ తెలుగు వారికే సొంతమైన అపురూప కళ అని అధికార భాషా సంఘం చైర్మన్ మంత్రి శ్రీదేవి అన్నారు .శ్రీత్యాగరాయ గాన సభలోని కళాసుబ్బారావు కళావేదికపై గానసభ నిర్వహణలో జరుగుతున్న ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణాచారి జన్మదిన సప్తాహంలో భాగంగా రవి కుమార్ సారథ్యంలో జొన్నలగడ్డ జగన్ మోహన్ సమర్పణలో చింతా మణి నాటకంలోని పురాణ ఘట్టం ప్రదర్శించారు. రాధ పాత్రలో రాజేశ్వరి, బిల్వ మంగలగా జగన్మోహన్, దామోదర్‌గా జంగయ్య గౌడ్ నటించి రక్తి కట్టించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి శ్రీదేవి పాల్గొని కళాకారులను అభినందించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నెహ్రూ జూలాజికల్ పార్కు సేవలు

- వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ను ఆవిష్కరించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్కులో మెరుగైన సేవలు అందించేందుకుగానూ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ను రూపొందించామని అటవీ పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ రూపొందించిన నెహ్రూ జూ పార్క్ కొత్త వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వెబ్‌సైట్‌లో సమస్త సమాచారాన్ని నిక్షిప్తం చేయడంతో పాటు సందర్శకులు సులువుగా జూ ఎంట్రీ టికెట్ బుకింగ్, బ్యాటరీ వెహికల్స్ ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చినట్టు వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం https://nzptsfd.telangana.gov.in ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సిజిజి డైరెక్టర్ జనరల్ రాజేంద్ర నిమ్జే, పిసిసిఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్ ఆర్ఎం. డోబ్రియాల్, అటవీ శాఖ సంయుక్త కార్యదర్శి ప్రశాంతి, పిసిసిఎఫ్ (ఎఫ్ఎసి) ఎంసీ. పర్గయిన్, జూ పార్క్ డైరెక్టర్ వినయ్ కుమార్, క్యురేటర్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య యాజమాన్యంపై హత్య కేసు నమోదు చేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
విద్యార్థుల ప్రాణాలను తీస్తున్న శ్రీచైతన్య యాజమాన్యంపై హత్య కేసు నమోదు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆ విద్యార్థికి అండగా నిలబడిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై అక్రమ కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న నిమ్మల రమాదేవి ఆత్మహత్యకు కారకులైన యాజమాన్యంపై హత్యకేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మార్కులు, ర్యాంకుల కోసం విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని తెలిపారు. లాభాలు తప్ప విద్యార్థుల సంక్షేమం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా ఆ యాజమాన్యంపై హత్యకేసు, క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆ విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. అరెస్టు చేసిన విద్యార్థి నాయకులను విడుదల చేయాలని,ఈ ఘటనకు కారకులైన వారిని తక్షణమే అరెస్టు చేయాలనీ, సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

విచారణ జరపాలి : పిడిఎస్‌యు

శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న నిమ్మల రమాదేవి ఆత్మహత్య ఘటనపై విచారణ జరపాలని పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు మామిడికాయల పరశురాం, ప్రధాన కార్యదర్శి ఇడంపాక విజయ్‌కన్నా డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించని కార్పొరేట్ కాలేజీల గుర్తింపును రద్దు చేసి వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని తెలిపారు.

శ్రీచైతన్యను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి : పిడిఎస్‌యు

శ్రీచైతన్య విద్యాసంస్థలను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు పి మహేష్, ప్రధాన కార్యదర్శి ఎస్‌వి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన ఆ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి బాధ్యులను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. ఆ విద్యాసంస్థ ఎలాంటి నిబంధనలు పాటించకున్నా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ఇంటర్ బోర్డు అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు.